# నీళ్ల ధోకాపై నాడే కేసీఆర్ పోరాటం

**ఆరు దశాబ్దాల వలస పాలనపై ధిక్కార స్వరం**

- సాగర్ ఎడమ కాల్వను ఎండబెట్టడంపై ఆగ్రహం
- కోదాడ నుంచి హాలియాకు భారీ పాదయాత్ర

కోదాడ, ఫిబ్రవరి 11: కృష్ణానదిపై ఉన్న నీటి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోవటంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణకు శాశ్వత నష్టం కలిగించే ప్రభుత్వ చర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాట శంఖం ఊదారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులు కాపాడటం కోసం 13వ తేదీన నల్లగొండలో భారీ సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ జల హక్కుల కోసం కేసీఆర్ సాగించిన పోరాటాలను తెలంగాణవాదులు గుర్తుచేసుకొంటున్నారు.

### కోదాడ నుంచి హాలియాకు పాదయాత్ర

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పొలాలను ఎండబెట్టిన వలస పాలకుల మెడలు వంచేందుకు కేసీఆర్ ఆనాడే నడుం బిగించారు. ఎడమ కాల్వకు జరుగుతున్న అన్యాయంపై ఆంధ్ర – తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కోదాడ నుంచి హాలియా వరకు వేలమంది ఉద్యమకారులతో పాదయాత్ర నిర్వహించారు. హాలియాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నల్లగొండ జిల్లా రైతులకు వలస పాలకులు చేసిన ద్రోహాన్ని ఎండగట్టారు. దాంతో దిగొచ్చిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కుడి కాల్వకు నీటిని నిలిపివేసి ఎడమ కాల్వకు విడుదల చేసింది. స్వరాష్ట్రంలో సీఎంగా బాధ్యతలు చేపట్టి 9 ఏండ్లలో అన్ని రంగాలను అభివృద్ధి బాట పట్టించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. 2003 ఆగస్టు 26న సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేయాలని, ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కోదాడలో కేసీఆర్ పాదయాత్ర ప్రారంభించారు. కోదాడలోని తెలంగాణ చౌరస్తా వద్ద జరిగిన సమావేశంలో నాటి పాలకుల ధోకాను సవివరంగా ప్రజలకు వివరించారు. ఆ తర్వాత చిలుకూరు నుంచి హుజూర్‌నగర్ మీదుగా గరిడేపల్లి, చిల్లేపల్లి, మిర్యాలగూడ నుంచి నిడమనూరు మీదుగా హాలియాకు ఐదు రోజుల పాటు పాదయాత్ర కొనసాగింది. అక్కడ నిర్వహించిన సభకు బీఆర్ఎస్ అప్పటి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, అప్పటి జిల్లా అధ్యక్షుడు తిప్పన విజయసింహారెడ్డి నేతృత్వం వహించారు. ఆ సభలో ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతాన్ని ఉమ్మడి పాలకులు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఎలా విధ్వంసం చేశారో ప్రజలకు కేసీఆర్ వివరించారు. ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించడంతో టీడీపీ ప్రభుత్వం తలొగ్గి నీటిని విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఈ పాదయాత్ర ఒక అపురూప ఘట్టమని చెప్పవచ్చు.



2003లో కోదాడ నుంచి హాలియాకు పాదయాత్ర చేస్తున్న ఉద్యమనేత కేసీఆర్

**హాలియాలో 20 వేల మందితో ధర్నా**



కేసీఆర్ 14 ఏండ్లు చేసిన అలుపెరుగని పోరాటంతోనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. 2003లోనే సాగర్ ఎడమ కాల్వపై రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టారు. ఆ సంవత్సరం ఆగస్టు 26న ఆయనతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్రలో అడుగు కలిపాను. రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని అప్పట్లోనే మాకు చెప్పారు. ఆ తర్వాత హాలియా ధర్నాకు 20 వేల మంది హాజరయ్యారు. ధర్నాలో కేసీఆర్ మాట్లాడుతుండగానే ఆంధ్రా అధికారులు కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. విషయం తెలుసుకున్న కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ ధర్నాకు తలొగ్గిన ఆంధ్రా పాలకులు కుడి కాల్వకు నీటిని నిలిపివేశారు. సీఎం కేసీఆర్ పదేండ్లలో 18 విడతలు ఎడమ కాల్వ ద్వారా పంటలకు సాగునీరు అందించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండో పంటకు కూడా నీళ్లు అందించలేని దుస్థితిలో ఉన్నది. ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతాం.

– తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు

## ముమ్మరంగా సభ ఏర్పాట్లు

- నల్లగొండలో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): చలో నల్లగొండ బహిరంగసభకు పట్టణ శివారులోని నార్కట్‌పల్లి–అద్దంకి హైవేకు అనుకుని మర్రిగూడ బైపాస్‌లో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సభా నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభా ప్రధాన వేదిక, కళాకారుల వేదిక నిర్మాణం పూర్తి కావస్తుండగా గ్యాలరీల నిర్మాణం, బారి కేడింగ్, పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయడం లాంటి పనులన్నీ చకచకా చేపడుతున్నారు. సోమవారం సాయంత్రం వరకు ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఆదివారం ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయుడు కంచర్ల కృష్ణారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. మరోవైపు సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రజలను కదిలించేందుకు బీఆర్ఎస్ పార్టీ యావత్తు రంగంలోకి దిగింది. కృష్ణానదీ పరివాహక ప్రాంతాలపై నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలతోపాటు తాగునీటిపై ఆధారపడిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రజలు తరలిరావచ్చని భావిస్తున్నారు.



ఆదివారం నల్లగొండలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

## అడ్డంకులు సృష్టిస్తే తొక్కుకుంటూ వెళ్తాం

- కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనం
- ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు
- ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నీలగిరి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ సర్కార్ అవగాహన లేకుండా కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిందని, ఫలితంగా కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రైతులను జాగృత పరచడానికి ఈనెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నామని, అడ్డంకులు సృష్టించడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నల్లగొండకు రావాలంటే ముక్కు నేలకు రాయాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై వారు తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్ బహిరంగ సభా స్థలాన్ని ఆదివారం వారు పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతిస్థిమితం లేకుండా ఎప్పుడు ఏమి మాట్లాడుతాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. శ్రీశైలం సొరంగ మార్గాన్ని సంవత్సరాల తరబడి పని జరిగే విధంగా ఒప్పందం చేసుకున్నది కాంగ్రెస్ పార్టేనని గుర్తుచేశారు. అప్పుడు పూర్తి చేయకుండా ఇప్పుడు ఆ తప్పును కేసీఆర్ మీదకు నెట్టడమేమిటని ప్రశ్నించారు. కోమటిరెడ్డి మాయ మాటలు నమ్మి ఓట్లేసిన జనం ఆయన్ను చీదరించుకొనే రోజు దగ్గరలోనే ఉన్నదని తెలిపారు. 20 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా నల్లగొండను అభివృద్ధి చేయలేపోయిన కోమటిరెడ్డి ఏ ముఖం పెట్టుకొని కేసీఆర్‌ను విమర్శిస్తున్నాడని ప్రశ్నించారు. మెడికల్ కాలేజ్, ఐటీ టవర్, నాగార్జున కళాశాల పునర్నిర్మాణం, విశాలమైన రోడ్లు ఇలా రూ.1,300 కోట్లు వెచ్చించి కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. ఇకనైనా మాయమాటలు, మోసపు చేతలు మానుకుని నల్లగొండ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

## జోకర్స్.. బ్రోకర్స్ కోమటిరెడ్డి బ్రదర్స్

- తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది కేసీఆర్ ఒక్కరే
- మీడియాతో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఫిబ్రవరి 11: నల్లగొండలో ఈ నెల 13న జరిగే కేసీఆర్ సభను అడ్డుకుంటామని జోకర్స్, బ్రోకర్స్ కోమటిరెడ్డి బ్రదర్స్ చెప్పడం పిరికిపంద చర్య అని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కేసీఆర్ అడ్డా అని, కేసీఆర్ అంటే త్రీ ఫేజ్ కరెంట్.. ముట్టుకుంటే మసైపోతారని హెచ్చరించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కోసం కొట్లాడి తెచ్చుకున్నది నీళ్ల కోసమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కృష్ణానీటిలో తెలంగాణ వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ప్రజలను, రైతాంగాన్ని మోసం చేయడమేనని పేర్కొన్నారు. రైతుల కోసం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పేగులు తేగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. తక్షణమే ప్రభుత్వం కేఆర్ఎంబీ ఒప్పందాన్ని విరమించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఓటుకు నోటు దొంగ ముఖ్యమంత్రి కావడం దురదృష్టం అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. కల్లుతాగిన కోతుల్లా కోమటిరెడ్డి బ్రదర్స్ పూటకో మాట మాట్లాడుతూ కేసీఆర్ సభను అడ్డుకుంటామనడం సిగ్గుచేటని అన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్

## కోమటిరెడ్డి దురుసు భాష

- మళ్లీ అనుచిత వ్యాఖ్యలు
- ప్రజలు చీదరిస్తున్నా అదే వైఖరి



నీలగిరి, ఫిబ్రవరి 11: తెలంగాణ జల హక్కుల రక్షణకై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 13న నల్లగొండలో తలపెట్టిన సభపై రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి నోరు పారేసుకొన్నారు. ఇప్పటికే రైతులను చెప్పుతో కొట్టాలని నోటికొచ్చినట్టు మాట్లాడి ప్రజల ఆగ్రహానికి గురైన ఆయన.. మళ్లీ అదేవిధంగా మాట్లాడారు. నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పి, ముక్కు నేలకు రాసిన తరువాతే 13న జరిగే సభకు కేసీఆర్ రావాలని అడ్డదిడ్డంగా పేలారు. ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ రోజునే నల్లగొండ కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ ప్రధాన కూడలిలో ఒక కుర్చీ, పింక్ టవల్ వేసి కేసీఆర్ బొమ్మ పెట్టి ఎల్ఈడీ టీవీల్లో అప్పటి కేసీఆర్ ప్రసంగాలను పెట్టి రైతులతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు లేదని అన్నారు. దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చింది కేసీఆరేనని ఆరోపించారు.

## ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్టు వైరల్

**మృతుల కుటుంబాలను ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున పోస్టులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం.. కాంగ్రెస్ ఉచిత బస్సు స్కీం, ఆటో డ్రైవర్ల పాలిట శాపం.. కాంగ్రెస్ పాలనలో 20 మంది ఆటో డ్రైవర్ల మృత్యువాత.. అంటూ ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయిన వైనంపై ఎందరో పోస్టులు, వీడియోలను పెడుతూ మానవీయతను చాటుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల వివరాలతో 'ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్ట్' అన్న పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి స్కీం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 మందికి పైగా ఆటో డ్రైవర్లు చనిపోయారంటూ జాబితాను షేర్ చేస్తున్నారు. ఆ జాబితాకు పేపర్ క్లిప్పింగులు, టీవీ చానెళ్ల వీడియోలు జత చేస్తూ ఆధారాలతో షేర్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు రకాలుగా ప్రశ్నిస్తున్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారి చావులపై హేళనగా మాట్లాడుతున్నదని నెటిజన్లు ఫేస్‌బుక్, ఎక్స్ వేదికల్లో కామెంట్లు పెడుతున్నారు. మృతులు సారయ్య, సతీశ్‌గౌడ్, సత్యనారాయణ, అనిల్, హమీద్, అక్బర్, రాహుల్, నగేశ్, అరుణ్‌కుమార్, రవి, రామలింగయ్య తదితరుల ఫొటోలను షేర్ చేస్తూ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

## వేతనాలందక మాడల్ స్కూల్ టీచర్ల వెతలు: టీఎంఎస్‌టీఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మాడల్ స్కూల్ టీచర్ల వేతనాలు 11వ తేదీ దాటినా అందకపోవడంతో తమ కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు యాకమల్లు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 194 మాడల్ స్కూళ్లలో పనిచేస్తున్న 5,000 మంది సిబ్బందికి వేతనాలు అందలేదని పేర్కొన్నారు. కుటుంబ, ఇతర అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని తెలిపారు. ఈఎంఐలు చెల్లించని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఈ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, ఇక నుంచి ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# కృష్ణా నీళ్లు మా హక్కు.. ఇక కొట్లాటే!

- పోరాటాల పాలికేక నల్లగొండ సభ
- రాజకీయం కాదు.. నీళ్ల కోసం ఆరాటం
- సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ఐదు ఉమ్మడి జిల్లాలు ఇక ఎడారే
- హైదరాబాద్ నగరానికి నీళ్ల కష్టాలే
- కృష్ణా రైతులు పోరాటానికి రెడీ కావాలి
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

సూర్యాపేట, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల్లో నీటి వాటాలను తేల్చకుండా నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించడంతో ఐదు ఉమ్మడి జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా తెలంగాణకు ద్రోహం చేశారని ఫైరయ్యారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగుతున్నారని, సిగ్గులేకుండా బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 13న ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే మరో పోరాటానికి సిద్ధమవుతున్నారని స్పష్టంచేశారు. ఇది రాజకీయం కాదని, తెలంగాణ ప్రజల బతుకుదెరువు సమస్య అని చెప్పారు. తెలంగాణ హక్కు రక్షణకు కొట్లాట తప్పదని, ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతను వ్యతిరేకిస్తూ ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బహిరంగసభ నిర్వహించే నేపథ్యంలో జగదీశ్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

> చంద్రబాబు హయాంలో వరుసగా ఏడేండ్లు ఒక్క పంటకూ నీళ్లివ్వలేదు. కృష్ణా డెల్టాకు నీటిని వదిలి కుడి కాల్వ ఆయకట్టులో పొట్టకు వచ్చిన వరి ఎండిపోయినా స్పందించలేదు. ఒక్క తడికి నీళ్లివ్వాలని రైతులు కోరినా నాడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డితోపాటు ఏఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా మాట్లాడలేదు. అలాంటి పరిస్థితిలో కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేసి.. 'సీఎం గారు నీళ్లిస్తావా? లక్ష మందితో డ్యామ్‌పైకి రావాల్నా?' అని హెచ్చరించడంతో ఆరోజు సాయంత్రానికే నీళ్లిచ్చారు. మళ్లీ నేడు కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ రైతుల పక్షాన నల్లగొండలో సభ ద్వారా చేపడుతున్న ఉద్యమం విజయవంతం అవుతుంది.
>
> – జీ జగదీశ్‌రెడ్డి

### హక్కుల పరిరక్షణే ప్రధాన ఎజెండా

కృష్ణా జలాలపై మన హక్కులను పరిరక్షించుకోవడమే ప్రధాన ఎజెండా. కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించి ఎదురు దాడికి దిగుతున్నది. ఇది రాజకీయం కాదు, పూర్తిగా బతుకుదెరువు సమస్య. తెలంగాణలో కేసీఆర్ మార్క్‌లను చెరిపేస్తామంటూ రేవంత్ సర్కార్ పనికిమాలిన పలు నిర్ణయాలు తీసుకుంటున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్ల కోసం పోరాడి నాగార్జునసాగర్ ఆయకట్టుకు గత తొమ్మిదేండ్లుగా ఒక్క ఎకరం ఎండకుండా నీటిని అందించింది. నేడు నాగార్జునసాగర్ ఆయకట్టును కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా మళ్లీ ఎడారిగా మారే ప్రమాదం ఉన్నది.

### నల్లగొండ సభ ద్వారా మరో ఉద్యమం

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయం అంతాఇంతా కాదు. సాగర్ ఎడమ కాల్వ, శ్రీశైలంలో వారికి ఇష్టమైనట్టు నీళ్లు తీసుకొనిపోయారు. ఆంధ్రాలో ఏ అవసరం ఉన్నా దౌర్జన్యంగా, దుర్మార్గంగా గేట్లు ఎత్తి నీటిని తీసుకొనిపోయేవారు. తెలంగాణకు మంచినీళ్లు లేకున్నా కృష్ణాడెల్టాకు నీళ్లు తీసుకుపోయారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హక్కుగా ప్రతి చుక్కా వాడుకున్నాం. గతంలో నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని టెయిల్‌ఎండ్ రైతులు తమకు నీళ్లు రావడం లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డిలాంటి నాయకుల వద్దకు వెళ్తే.. 'అది టెయిలెండ్.. మీకు నీళ్లు రావు' అని చెప్పేవారు. రైతులు కూడా నమ్మేవారు. కానీ గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం టెయిల్‌ఎండ్‌కు కూడా నీళ్లిచ్చింది. అంతకుముందు నాగార్జునసాగర్ మొదటి తూము అయిన రాజవరం మేజర్‌కు యాభై ఏండ్లలో నీళ్లు చూడలేదు.. కానీ, మేం చివరి వరకు నీళ్లిచ్చాం. ఇన్ని చేసి నీటి వాటాను హక్కుగా వాడుకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దుర్మార్గంగా, రైతులపై కక్ష గట్టినట్టు నీటి లెక్కలు తేలకుండానే నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించింది. అందుకే నల్లగొండ సభ ద్వారా ఉద్యమం ప్రారంభిస్తున్నాం.

### రెండోసారి కేసీఆర్ నీళ్ల పోరాటం

తెలంగాణ హక్కుల కోసం ఎప్పుడూ ఏ జాతీయ పార్టీ తెలంగాణ ప్రజల వైపు నిలబడలేదు. బీఆర్ఎస్, కేసీఆర్ తప్ప ఎవ్వరికీ తెలంగాణ పట్ల సోయి లేదు. నీళ్లకు ఇబ్బందిలేకుండా పదేండ్లు తెలంగాణ రైతులు పంటలు పండించుకున్నారు. మళ్లీ ఇవ్వాళ 2000 సంవత్సరంనాటి పరిస్థితి వచ్చింది. నేడు నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నల్లగొండ వేదికగా మరో పోరాటానికి కేసీఆర్ శ్రీకారం చుడుతున్నారు.

### కేఆర్ఎంబీ అంశంపై నాడు ఏం జరిగిందంటే..

ప్రాజెక్టుల్లో నీటి వాటాను తేల్చకుండా కేంద్రం ఎప్పుడూ జాప్యం, మోసం చేస్తూ వస్తున్నది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించింది. ఈ ఒప్పందాన్ని రాసింది జైరాం రమేశ్. నాడు ఇక్కడ ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. కేసీఆర్ ఎక్కడా లేరు. నాడు ఒక్క సంవత్సరంలోపు ట్రిబ్యునల్ వేసి నీటి వాటాలు తేల్చుతామని చెప్పారు. ట్రిబ్యునల్ వేయకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. నాటి కేంద్రమంత్రి కేసు విత్‌డ్రా చేసుకుంటే ట్రిబ్యునల్ వేస్తామని చెప్పారు. అది మినిట్స్‌లో రికార్డు చేస్తేనే విత్‌డ్రా చేసుకుంటామని నాటి సీఎం కేసీఆర్ స్పష్టంచేసి, విత్ డ్రా చేసుకున్నారు. అయినా కదలికలు లేకపోవడంతో మళ్లీ కోర్టుకు వెళ్లారు. 14 నెలల క్రితం గడువు పెట్టకుండా కేంద్రం ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసింది. జాతీయ, అంతర్జాతీయ జలచట్టాల ప్రకారం నీటి వాటాలు తేల్చేందుకు ఆరు నెలల గడువు పెట్టాలని కోరాం.

### రేవంత్ సర్కార్‌ది అవగాహన రాహిత్యం

గతంలో ఆంధ్రా నాయకులు కేఆర్ఎంబీని వాడుకొని తెలంగాణకు అన్యాయం చేస్తూ వచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని హక్కులను సాధించుకున్నది. కానీ రేవంత్ ప్రభుత్వానికి కనీసం సోయి లేదు. అసెంబ్లీ ఎన్నికలకు రెండు రోజుల ముందు సాగర్ డ్యామ్ మీదకు ఏపీ పోలీసులు వచ్చారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అసలు ఏం జరిగింది? ఏమి చేయాలనే ఆలోచన, సోయి లేకుండా సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించింది. తదనంతరం అధికారులు సంతకాలు చేశారంటూ బుకాయిస్తున్నది. ఇంత పెద్ద సమస్యపై ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి సిగ్గులేకుండా మాట్లాడటం వారికే చెల్లింది. అందుకే మళ్లీ కేసీఆర్ కొట్లాడాల్సిన పరిస్థితి వచ్చింది.

### నీటి వాటా దక్కకుంటే పెను ప్రమాదమే

కృష్ణానదిలో తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటా దక్కకుంటే పెను ప్రమాదమే ముంచుకొస్తుంది. గత తొమ్మిదిన్నరేండ్లలో సాగర్ జలాలతోనే నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను రూపుమాపాం. నీటి వాటా దక్కకుంటే సమస్య పునరావృతం అవుతుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో మంచినీళ్లు ఉండవని ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు పారిశ్రామికవేత్తలే కాదు ప్రజలు కూడా ఇక్కడకు వచ్చేందుకు జంకేవారు. కానీ కేసీఆర్ ప్రభుత్వ పనితీరుతో మంచినీళ్లు, విద్యుత్తు విషయంలో ప్రపంచంలోనే హైదరాబాద్‌కు గుర్తింపు వచ్చింది. ఆ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలి. ఇది ఎవరో ఒక్కరి సమస్య కాదు. ఐదు జిల్లాల ప్రజల బతుకు పోరాటానికి సంబంధించింది.

### నల్లగొండ సభతో జాగృతం

నల్లగొండ సభతోపాటు తదనంతరం వివిధ కార్యక్రమాల ద్వారా కేఆర్ఎంబీకి వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేసేలా కేసీఆర్ ప్రసంగం ఉంటుంది. మన హక్కులు మనం కాపాడుకునేంత వరకు తెలంగాణ సమాజం కొట్లాడాల్సిందే. రెండు రాష్ట్రాల నీటి వాటాలు తేల్చేనంత వరకు నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించరాదు. నీటి వాటా తేలిన తరువాత ఏదైనా చేసుకోవచ్చు. లేదంటే మళ్లీ కృష్ణా పరీవాహక ప్రాంతం ఎడారి కానున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు నిలదీయాలి.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 18.8°c | 37.3°c |
| ఖమ్మం | 20.0°c | 36.0°c |
| వరంగల్ | 20.0°c | 32.0°c |
| కరీంనగర్ | 20.0°c | 32.0°c |
| మెదక్ | 20.3°c | 37.3°c |
| నల్లగొండ | 21.0°c | 31.5°c |
| హైదరాబాద్ | 21.3°c | 31.8°c |
| ఆదిలాబాద్ | 21.4°c | 34.5°c |
| మహబూబ్‌నగర్ | 21.9°c | 33.8°c |
| నిజామాబాద్ | 22.5°c | 34.2°c |

## గ్రూప్-1కు లైన్ క్లియర్

- సుప్రీంలో కేసు వాపస్ తీసుకొన్న టీఎస్‌పీఎస్సీ!
- కొత్తగా నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు?

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రూప్–1 పరీక్ష కొత్తగా నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీకి లైన్ క్లియర్ అయింది. సుప్రీంకోర్టులో ఉన్న కేసును టీఎస్‌పీఎస్సీ ఉపసంహరించుకున్నట్టు తెలిసింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి నిర్వహించిన గ్రూప్–1 పరీక్షను రద్దు చేయాలని హైకోర్టు తీర్పు చెప్పడంతో.. ఆ తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టుకు వెళ్లిం ది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమించింది. అయితే, కొత్తగా మరికొన్ని పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిలోనూ సడలింపు ఇస్తున్నట్టు ప్రకటించింది. దీంతో మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాల్సి రావడంతో సుప్రీంకోర్టులో ఉన్న కేసును టీఎస్‌పీఎస్సీ ఉపసంహరించుకున్నట్టు తెలిసింది. కమిషన్ అభ్యర్థనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపితే కొత్త పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులకు గ్రూప్–1 నోటిఫికేషన్ త్వరలోనే వెలువడే అవకాశం ఉన్నది.

## ఇంధన సామర్థ్యంలో తెలంగాణ ఆదర్శం

- మిషన్‌లైఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన హీరాలాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంధన సామర్థ్య నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమారియా కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నెడ్‌క్యాప్ సౌజన్యంతో నిర్వహించిన విద్యుత్తు శాఖకు చెందిన మిషన్‌లైఫ్ దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడుతూ అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలుస్తున్న హైదరాబాద్‌లో మిషన్‌లైఫ్ వంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన మరింత పెరుగుతుందని తెలిపారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మిషన్‌లైఫ్ లక్ష్యాలు ఉన్నాయని వివరించారు. 2028 నాటికి భారత్‌లోని 80% గ్రామాలు, పట్టణ స్థానికసంస్థల్లో పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించడమే మిషన్‌లైఫ్ లక్ష్యమని పేర్కొన్నారు. సందర్భంగా మిషన్‌లైఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంసీహెచ్చార్డీఏ డైరెక్టర్ జనరల్, డాక్టర్ శశాంక్ గోయల్, బీఈఈ మీడియా అడ్వైజర్ ఏ చంద్రశేఖర్‌రెడ్డి, నెట్‌కాప్ ఎండీ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సవరణ బిల్లును రద్దుచేయాలి

- ఏఐఎఫ్‌ఈఈ 16వ జాతీయ సదస్సు తీర్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సవరణ బిల్లు–2022ను వెంటనే రద్దుచేయాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ (ఏఐఎఫ్‌ఈఈ) 16వ జాతీయ సదస్సు తీర్మానించింది. లేని పక్షంలో ఉద్యమాలకు వెనకాడబోమని హెచ్చరించింది. హైదరాబాద్ ఎర్రగడ్డలోని టీఎస్ జెన్‌కో ఆడిటోరియంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో భాగంగా ఆదివారం పలు తీర్మానాలను ఆమోదించారు. సదస్సు సందర్భంగా భారీ ర్యాలీతోపాటు బహిరంగ సభ నిర్వహించారు. సంఘం నేతలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పలువురు విద్యుత్తు రంగ ప్రముఖులు సదస్సులో పాల్గొన్నారు.

### 26 మందితో నూతన కమిటీ ఎన్నిక

26 మందితో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ మూర్తి(తమిళనాడు), ప్రధాన కార్యదర్శిగా మోహన్‌శర్మ (మహారాష్ట్ర), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సమీ ఉల్లా (కర్ణాటక), తెలంగాణ నుంచి ఉపాధ్యక్షుడిగా వేమునూరి వెంకటేశ్వర్లు, ఉప ప్రధాన కార్యదర్శిగా జీ సాయిబాబు తదితరులు ఎన్నికయ్యారు.

## రెండు ఎంపీ స్థానాల్లో సీపీఎం పోటీ: తమ్మినేని

హైదబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం రెండు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం తెలిపారు. ఈ మేరకు స్థానిక, జిల్లా కమిటీలతో చర్చించిన అనంతరం రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ, రాష్ట్ర కమిటీ సమావేశాల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి, తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించినట్టు పేర్కొన్నారు.

## సిక్కిం తరహాలో పాత పింఛన్‌ను అమలుచేయాలి: సీపీఎస్‌టీఈఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): సిక్కిం ప్రభుత్వ తరహాలోనే తెలంగాణలోనూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్‌ను అమలు చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం (సీపీఎస్‌టీఈఏ) ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాముక కమలాకర్, చీటి భూపతిరావు కోరారు. ఓపీఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదని, అదే సీపీఎస్ వల్లే ప్రభుత్వంపై ఆర్థికభారం పడుతుందని పేర్కొన్నారు. దేశంలో ఒక్కొక్కటిగా రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని రద్దుచేస్తూ, పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తున్నాయని, రేవంత్‌రెడ్డి సర్కారు సైతం పార్లమెంట్ ఎన్నికలకు ముందే దీనిపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.